అడుగంటిన చెరువులు

335 అడుగులకు చేరిన తమ్మిలేరు నీటిమట్టం

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుతో పాటు చెరువుల నీటి మట్టాలు తగ్గుముఖం పట్టాయి. గతేడాది తొలకరిలో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. ఆ తరువాత సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టం నానాటికి పడిపోతోంది. ఏప్రిల్ నెలలో ఎండలు మండిపోతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. భూగర్భ జలాలపై ఆధారపడిన మెట్ట ప్రాంతంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో చెరువులు ఎండి పోవడంతో పశువులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుల్లో నీరు ఉంటే భూగర్భజలాలు ఇంత దారుణంగా కిందికి పడిపోయే ప్రమాదం ఏర్పడేది కాదన్నది నిపుణుల అభిప్రాయం.



నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు రిజర్వాయర్ నీటిమట్టం

తగ్గుతున్న భూగర్భ నీటిమట్టం

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం సమీపంలో మూడు టీఎంసీల సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించారు. ప్రాజెక్టు క్రింద ఏలూరు జిల్లాలో 4,200 ఎకరాలు, ఎన్టీఆర్ కృష్ణా జిల్లాలో 4,969 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో నీరుంటే చుట్టు పక్కల మండలాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 355 అడుగులు. ప్రస్తుతం ప్రాజెక్టులో 335 అడుగులకు చేరింది. దీంతో పలు గ్రామాల్లో భూగర్భ నీటిమట్టం తగ్గు ముఖం పడుతోంది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తే మెట్టకు సాగునీటి కష్టాలు తప్పుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తిచేయాలి



టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావస్తోంది. ఇంతవరకు చింతలపూడి పథకానికి నిధులు కేటాయించలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తక్షణం పూర్తి చేయాలి. అదేవిధంగా జపాన్ ఆర్థిక బ్యాంక్ (జైకా) నుంచి వచ్చిన నిధులతో తమ్మిలేరు మరమ్మతు పనులు ప్రారంభించి ఈ వేసవిలోనే పూర్తి చేయాలి.

– బొద్దు వెంకటేశ్వర్రావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు

నీటి ప్రవాహానికి అడ్డంకులు

కడెమ్మ కాలువలో పెరిగిన తూడు, తుప్పలు

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో అతిపెద్ద సాగునీటి చెరువు కొత్తూరు చెరువు. ఇందులో కొమ్ము తిరిగిన నీటితో పాటు కొండ వాగుల నీరంతా కడెమ్మ కాలువ ద్వారా ప్రవహించి కడెమ్మ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతుంది. సుమారు మూడు కిలోమీటర్ల పొడవున ప్రవహించే కడెమ్మ కాలువ కొన్నేళ్లుగా మరమ్మతులకు కూడా నోచుకోలేదు. దీంతో కాలువలో గుర్రపు డెక్క, తూడు, మొక్కలు పెరిగిపోయాయి. కాలువ మధ్యలో ఇసుక మేటలు వేశాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వర్షాకాలంలో కొండవాగుల నీరు ఉధృతంగా ప్రవహించి పంట పొలాలు ముంచెత్తుతుంది. గోదావరి వరద పెరిగినప్పుడల్లా కడెమ్మ స్లూయిజ్ ద్వారా వరద నీరు ఎగపోటుకు పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వరి పొలాలు దెబ్బతినడం పరిపాటిగా మారింది.

కాలువలోకి జారుతున్న మట్టి

కడెమ్మ స్లూయిజ్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వర్షాకాలంలో మట్టి జారిపోవడంతో కాలువ పూడుకుపోతుంది. దీంతో నీరు కూడా గోదావరిలోకి చేరడం లేదు. కాలువ వెడల్పు చేసి జంగిల్ క్లీనింగ్, డిసిల్టింగ్ పనులు చేస్తే సాగు నీరు అందడంతో పాటు ముంపు ముప్పు తప్పుతుందని, కడెమ్మ కాలువ మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. సమస్యను మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా కడెమ్మ కాలువలో జంగిల్ క్లీనింగ్, డీసిల్టింగ్ పనులు చేపట్టేందుకు రూ.10 లక్షలతో ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు చెప్పారు. నిధులు మంజూరైతే పనులు చేపడతామని వివరించారు.



కడెమ్మ కాలువలో పెరిగిపోయిన మొక్కలు, తూడు

బెల్లపు ఊట ధ్వంసం



ఎల్ఎన్‌డీపేట ప్రాంతంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్ డీపేట ఒంటి కొండ సమీపంలో సారా తయారీ ప్రాంతాల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పోలీసులు దాడులు చేశారు. సారా తయారీకి ఉపయోగించే 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, కేసు నమోదు చేశామని పోలవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. సారా తయారు చేసినా, అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ సత్యవతి, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ ఫణికుమార్, పోలవరం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పంగిడిగూడెం భూములు పేదలకు పంచాలి



ఆర్డీఓ రమణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెం సీలింగ్ భూముల విషయంలో 1983 నుంచి నేటి వరకు జరిగిన అవకతవకలపై బహిరంగ విచారణ చేసి, ఆ భూములను పేదలకు పంచాలని సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.రంగనాథం, ఆదివాసీ భారత్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, ఎం రామిరెడ్డి, మట్టపర్తి వెంకట్రావు, పి.రాఘవులు, లింగాల దుర్గారావు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌కు ప్రశంస



శ్రీకర్‌బాబు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న షేక్ పకీర్‌సాహెబ్

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరం పోస్టాఫీసు అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ షేక్ పకీర్ సాహెబ్ గురువారం ప్రశంసాపత్రం అందుకున్నారు. పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న పొదుపు ధీర అకౌంట్స్ లక్ష్యాన్ని అధిగమించినందుకు ఆయన్ని ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు శ్రీకర్‌బాబు ప్రశంసాపత్రంతో సత్కరించారు. అంకితభావంతో పనిచేస్తే ఎవరికైనా గుర్తింపు లభిస్తుందని ఆయన శ్రీకర్‌బాబు అన్నారు. పకీర్ సాహెబ్‌ను ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను చేధించాలని ఉద్యోగులకు సూచించారు. జంగారెడ్డిగూడెం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు కంపా శ్రీనివాసరావు, పోస్టల్ ఉద్యోగులు పకీర్‌షాను అభినందించారు.

క్లుప్తంగా

రాజర్షికి కందుకూరి పురస్కారం



పురస్కారం అందుకున్న రాజర్షి

కొయ్యలగూడెం: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, నాటక రంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహాశివ బట్టు వెంకట రాజర్షికి కందుకూరి పురస్కారం లభించింది. ఈనెల 16న రాత్రి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పురస్కారం అందుకున్నట్టు గురువారం రాజర్షి తెలిపారు. ఆయన్ని శ్రీరామ విలియం హోటైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు కలిసి అభినందించారు.

పీహెచ్‌సీకి సాంకేతిక పరికరాల అందజేత



పీహెచ్‌సీకి పరికరాలను అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం పీహెచ్‌సీ అభివృద్ధికి నవభారత్ లిమిటెడ్ సంస్థ సహకరించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు పేర్కొన్నారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ నవభారత్ లిమిటెడ్ వితరణతో బయ్యన్నగూడెం పీహెచ్‌సీకి రూ.2 లక్షల విలువైన సాంకేతిక పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో తాతారావు పాల్గొని మాట్లాడారు. ఈసీజీ మెషీన్, ఎయిర్ కండిషనర్, వాషింగ్ మెషీన్, కలర్ ప్రింటర్, కంప్యూటర్ తదితర ఏడు రకాల పరికరాలను అందించినట్టు ఫౌండేషన్ పీఆర్‌ఓ ఏవీ రాఘవరావు తెలిపారు. పీహెచ్‌సీలో షెడ్ నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం గీతారాణి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ఎల్ అనంతలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ ఎల్.సుబ్రహ్మణ్యం, మద్దు తేజ, ఆరేటి ఏసుబాబు, డీసీఎం రాజగోపాల్, సీనియర్ మేనేజర్ సిద్ధార్థ్, లీలాకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ జయరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి



కొత్తపల్లి మురళీకృష్ణ

దెందులూరు: ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి మురళీకృష్ణ నియమితులయ్యారు. గురువారం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ఈ మేరకు లికిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. మురళీకృష్ణ నియామకంపై జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్, ఎంఎస్‌పీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

గురు శర్మకు సాహితీ సంబరాల ఆహ్వానం



గురు శర్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సాహితీ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంగా మే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు నగరానికి చెందిన కవి గురు శర్మకు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళా వేదిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కవిగా, రచయితగా, వాఖ్యాతగా అనేక రికార్డులు సొంతం చేసుకున్న గురు శర్మకు ఆహ్వానం అందడం సముచిత నిర్ణయమని నగరానికి చెందిన సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమ రావు, గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు, సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు అభినందించారు.

కాపు నేత హరికృష్ణకు జేపీ పరామర్శ



హరికృష్ణను పరామర్శిస్తున్న జయప్రకాష్, నాయకులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏలూరు నగర కాపు నాయకుడు జల్లా హరికృష్ణను వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పరామర్శించారు. అదేవిధంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న పార్టీ నేత కుంచాడ శ్రీనివాసు భార్యను పరామర్శించారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న నాయకులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జేపీ వెంట పార్టీ నాయకులు గుడిదేశి శ్రీనివాసు, నేరుసు చిరంజీవి, జాన్ గుర్నాథ్, కొల్లిపాక సురేష్, సైదు కొండ, సునీల్, ఫణి, రామకృష్ణ, తంగిల రాము, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వ్యర్థాలతో సంపద సృష్టిద్దాం

చింతలపూడి : గ్రామ పంచాయతీల్లో గృహాల నుంచి సేకరించిన వ్యర్థాలతో సంపదను సృష్టించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఈవోపీఆర్డీ కె.రత్నకుమార్ విజ్ఞప్తి చేశారు. చింతలపూడి మండలం యర్రంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలపై శిక్షణ ఇచ్చారు. రత్నకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా వర్మి కంపోస్టు తయారీపై జీరో వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. చింతలపూడి, లింగపాలెం, టి.నర్సాపురం మండలాల పరిధిలోని ఈఓలు, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. యర్రంపల్లి పంచాయతీ సర్పంచ్ కొమ్ము ఆగ్నేశమ్మ, ఉపసర్పంచ్ జంగా చెన్నకేశవరెడ్డి, డీపీఆర్ సి.శ్యామలరావు, టి.నర్సాపురం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



యర్రంపల్లిలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ రత్నకుమార్

ఆరోగ్యవంతమైన ఆహారం అందించాలి

ద్వారకాతిరుమల: బాలింతలు బిడ్డకు ఆరోగ్యవంతమైన ఆహారం ఇవ్వడంతో పాటు, శారీరక శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార లోప నివారణకు చేపట్టాల్సిన చర్యలపై గర్భిణులు, బాలింతలకు మేరి అవగాహన కల్పించారు. బిడ్డకు తల్లి ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలన్నారు. గర్భిణులు కనీస రెండు సార్లు నులిపురుగుల నివారణ మందు ఆల్బెండజోల్ వేసుకోవాలని సూచించారు. సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీ సుజన, ఏఎన్ఎం మోహిని మాట్లాడుతూ గర్భిణి 180 ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు వాడితే ప్రసూతి తర్వాత త్వరగా కోలుకుంటారని తెలిపారు. కాల్షియం, ఐరన్ లోపాలు తొలగుతాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది కృష్ణవేణి, రేణమ్మ, ఆశా వర్కర్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆర్టీసీ కార్మికుల నిరసన

జంగారెడ్డిగూడెం: ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ గ్యారేజ్ గేటు వద్ద డిమాండ్లతో కూడిన ఫ్లకార్డులతో ఆర్టీసీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో ప్రెసిడెంట్ ఎన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ 38 డిమాండ్లపై యాజమాన్యం స్పందించకపోవడంతో మూడో దశ పోరాటంలో భాగంగా నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్, రిమూవర్స్ వెంటనే ఆపాలని, ఆగిపోయిన ప్రమోషన్స్ ఇవ్వాలని, గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ డీవీఎస్ఎన్‌టీ రాజు, గ్యారేజ్ సెక్రటరీ టి.ఇశ్రాయేలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వృద్ధుల ఆశ్రమంలో సదుపాయాలపై ఆరా

ఏలూరు (టూటౌన్): స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ గురువారం సందర్శించారు. ఇక్కడ వృద్ధులకు అందుతున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యత, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వృద్ధులతో మాట్లాడారు. న్యాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని, సంక్షేమ పథకాలను పొందడంలో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో ఇచ్చిన సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని రత్నప్రసాద్ తెలిపారు. పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం ఎక్కువగా ఉన్న దోమలు బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

జెడ్పీ అతిథి గృహ ప్రహరీ ప్రారంభం

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ అతిథి గృహ ప్రహరీని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ జనరల్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో 70 మీటర్ల పొడవైన ప్రహరీని నిర్మించామని పద్మశ్రీ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వర రావు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎంవీ రమణారావు, డీఈ జె.శ్రీనివాస్, డీఆర్ఐ డీఈ శ్రీనివాస్, ప్రాజెక్ట్ డీఈ సురేష్, జిల్లాలోని జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ

గణపవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మాలమహానాడు జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పరలో మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఎస్సీల్లో 59 ఉపకులాలు ఉన్నాయని, వీటిలో ఏకులాలు అయితే అభివృద్ధి చెందాయో? వాటికి ప్రాధాన్యత తగ్గించి, వెనుకబడి ఉన్న కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కాని ఆ తీర్పునకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వ్యవహరిస్తూ ఎస్సీ వర్గీకరణ చేస్తున్నాయని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ మెప్పుకోసం ఈ రెండు ప్రభుత్వాలు పని చేస్తూ మాలలను మోసం చేస్తున్నాయనివి మర్శించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చోడదాసి జైపాల్, సంతోష్, సాల్మన్, కొండేటి రాజా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంగరాజు

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గణపవరం: మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, వారంలో ఒకరోజును డ్రైడేగా పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. గురువారం ఆయన పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని పిప్పర, చిలకంపాడు, కాశిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్‌సర్వే, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే కార్యక్రమాలను ఆకస్మికతనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇంటి పరిసరాలలో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమలను లార్వా దశలోనే అరికట్టాలని వివరించారు. ఫీవర్ సర్వే రికార్డులను పరిశీలించారు. ఇళ్ల వద్ద వాడకంనీరు నిలువ ఉంటున్న మహిళలకు దానివల్ల కలిగే అనర్థాలను వివరించారు. వారానికి నీటి కుళాయిలు, వాటర్ ట్యాంకుల, నీటి తొట్టెలను శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వాకపల్లిలో ఫీవర్ సర్వేను తనిఖీ చేస్తున్న డివిజనల్ మలేరియా అధికారి

పౌష్టికాహారంతోనే చిన్నారుల ఎదుగుదల

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎప్పటికప్పుడు పోషకాహారం అందించినప్పుడే వారి లో వయస్సుకు తగిన విధంగా ఎదుగుదల, బరువు, హిమోగ్లోబిన్ వంటివి ఉంటాయని ఏలూరు ప్రాజెక్టు అధికారిణి విజయలక్ష్మి అన్నారు. స్థానిక శనివారపుపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోషకాహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ బి.మంగ, ఏఎన్ఎం ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.నాగమణి, టి.జయలక్ష్మి, ఎంవీ నరసమాంబ, టి.సుభాషిణి, పి. మార్తమ్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించాలి

భీమడోలు: మహిళా రైతు సంఘాల సభ్యులు ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు ప్రభుత్వం రుణాలను అందించి వారిని ప్రోత్సాహిస్తుందని భీమడోలు ఏపీఎం కె. రత్నకుమారి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్య పరిధిలోని మహిళా రైతు సంఘాల సభ్యుల ఆర్థిక స్వావలంబనకు తీసుకోవాల్సిన అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రైతు సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మండలానికి రూ.5 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను మంజూరు చేసిందన్నారు. మండల వ్యాప్తంగా 80 మహిళా రైతు సంఘాలున్నాయని, మరో 20 సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సంఘంలో 10 నుంచి 12 సభ్యులు ఉండాలని సూచించారు.

కార్మికుల జీఓలను అమలు చేయాలి

గణపవరం: క్లీన్ అండ్ గ్రీన్, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ అంటూ అనేక పథకాలు అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పథకాల కోసం నిరంతరం చీపురుపట్టి వీధులు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమని జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు అన్నారు. గురువారం గణపవరంలో నిర్వహించిన పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సంక్షేమానికి ఉన్న అనేక జీఓల అమలులోనే ప్రభుత్వాలకు చిత్తశుద్ధిలోపించిందని విమర్శించారు. కార్మికులకు చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు వంటివి కూడా అందించే పరిస్థితి లేదని జిల్లాలో దాదాపు అన్ని పంచాయతీలలోనూ ఇదే దుస్థితి ఉందన్నారు. సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నూర్ బాషాలకు సముచిత స్థానం కల్పించాలి



షేక్ ఇస్మాయిల్

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో నూర్ బాషాల (దూదేకులు)కు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని నూర్ బాషా సంఘం గోపాలపురం నియోజకవర్గం అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు ఎమ్మెల్యేలు, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్, మైనార్టీ కార్పొరేషన్, మంత్రి పదవితో పాటు, ప్రభుత్వ సలహాదారు పదవిని ముస్లిం మైనార్టీలకే కేటాయించి, నూర్ బాషాలను పక్కన బెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు కేటాయించే నామినేటెడ్ పదవుల్లో కనీసం 30 శాతం నూర్ బాషాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, రాయలసీమ ప్రాంతంలో అధికంగా ఉన్న నూర్ బాషాలను చిన్నచూపు చూడటం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు ఇబ్రహీం, నాయకులు పాల్గొన్నారు.

నేడు దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన



అంకాలగూడెంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కొయ్యలగూడెం: శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంకాలగూడెంలో శుక్రవారం ఉదయం 7.52 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం విఘ్నేశ్వర పూజ, విగ్రహానికి ధాన్యాధివాసం తదితర పూజలు చేశారు. ప్రతిష్ఠాపన అనంతరం అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.